

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం

18 నవంబర్ 2025 పేజీలు : 08


## హిందూపురం వైసీపీ కార్యాలయంపై

# దాడికి నిరసన



**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :**

హిందూపురం వైసీపీ ఆఫీస్‌పై దాడికి నిరసనగా సోమవారం నెల్లూరు వీఆర్సీ సెంటర్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. హిందూపురం వైసిపి ఆఫీస్ పై టిడిపి గుండాల దాడికి నిరసనగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి.. వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, వైఎస్ఆర్సిపి సిటీ ఇన్చార్జి ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డి నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా నల్లరిబ్బన్లు ధరించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ఎదుట.. వైసిపి ఆఫీస్‌పై దాడికి సంబంధించిన.. చిత్రాలను ప్రదర్శిస్తూ నిరసన తెలియజేశారు.

కూటమి ప్రభుత్వ రెడ్‌బుక్ పాలన

-మిగతా 2లో

## సీఎం పాలనా దక్షతతో..

# రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ

- రెండు రోజుల్లోనే 613 ఒప్పందాలు, రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడుల సాధన
- 16 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు
- సీఐఐ సమ్మిట్ విజయవంతంతో ఏపీ వైపు ప్రపంచం చూపు
- జిల్లాలో ప్రఖ్యాత కంపెనీల పెట్టుబడులు
- నాడు గత పాలకుల నిర్లక్ష్యంతో పారిశ్రామిక తిరోగమనం
- నేడు పరిశ్రమల రాకతో రాష్ట్రం, జిల్లా సమగ్రాభివృద్ధి
- ప్రజల తరపున సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు
- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనా దక్షతతో సీఐఐ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వచ్చాయని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు అన్నారు. విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీఐఐ సమ్మిట్ విజయవంతం కావడంపై సోమవారం నెల్లూరులోని తమ నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఐటీ మినిస్టర్ నారా లోకేష్‌ల కృషితో సీఐఐ సమావేశం ద్వారా సాధించిన ప్రగతిని, పెట్టుబడులను, జిల్లాకు వస్తున్న కంపెనీలు తదితరాలను వివరించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.13,25,716 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు కుదుర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారం, సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్, మంత్రి నారా లోకేష్ పెట్టుబడిదారులతో

-మిగతా 2లో

## లక్ష్యసాధనలో స్పీడ్ పెంచిన

# మంత్రి నారాయణ

- నెల్లూరు నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో సుడిగాలి పర్యటన చేపట్టిన మంత్రి
- ప్రభుత్వ పాఠశాలలో చేపడుతున్న ఆధునీకరణ పనులు పరిశీలన
- వీఆర్సీ హైస్కూల్ మాదిరిగా సిటీలో మరో 15 పాఠశాలల రూపురేఖలు మార్పు చేస్తామన్న మంత్రి నారాయణ



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :**


ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేదపిల్లల విద్యపై ప్రత్యేక ద్రుష్టి సాధించినట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. లక్ష్య సాధనలో స్పీడ్ పెంచిన మంత్రి పి4 ద్వారా వీఆర్సీ

-మిగతా 2లో

## స్పోర్ట్స్ స్టేడియానికి

# వీడిన గ్రహణం

- యువత కలలకు సాకారం
- మంత్రి ఆనం ప్రత్యేక చొరవతో 1.80 కోట్ల నిధులు మంజూరు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

ఆత్మకూరులో 12 ఏళ్లుగా నిర్మాణం నిలిచిపోయిన స్పోర్ట్స్ స్టేడియంకు మోక్షం లభించింది. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక కృషితో ఈ స్టేడియంకు 1.8 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 12 సంవత్సరాల క్రితం ఈ స్టేడియంకు మంత్రి ఆనం నిధులు మంజూరు చేయించడం, కొంత నిర్మాణం జరిగాక ప్రభుత్వం మారగా నిర్మాణం నిలిచిపోవడం, దాన్ని గురించి నాటినుండి ఎవరూ పట్టించుకొనక పోవడం సూర్య పాఠకులకు విధితమే. కాగా మళ్ళీ ఆనం ఆత్మకూరు ఎమ్మెల్యే కావడం, రాష్ట్ర మంత్రి కావడంతో ఆయన శ్రద్ధ తీసుకొని స్పోర్ట్స్ స్టేడియానికి స్పోర్ట్స్ అథారిటీ ద్వారా 1.8కోట్ల రూపాయలు మంజూరు చేయించారు. నెల్లూరు క్యాంపు కార్యాలయంలో శాప్ అధికారులతో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆత్మకూరు నియోజకవర్గం కేంద్రంలో 12 ఏళ్ల క్రితం ఆనం రామనారాయణరెడ్డి ప్రతిపాదించి ప్రారంభించిన స్పోర్ట్స్ స్టేడియం పనులకు గ్రహణం వీడేలా

-మిగతా 2లో

# హిందూపురం వైసీపీ కార్యాలయంపై దాడికి నిరసన

(మొదటి పేజీ తరువాయి)

నశించాలని కార్యకర్తలు నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టి హింసించడం లాంటి పనులు చేస్తూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ టిడిపి నేతలు దుర్మార్గ పాలన సాగిస్తున్నారని జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్రంగా విమర్శలు గుప్పించారు. హిందూపురం వైసిపి ఆఫీస్‌పై టిడిపి గుండాలు చేసిన దాడి తెలుగు దేశం పార్టీ పరాకాష్టకు నిదర్శనం అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ ఆకృత్యాలకు నిరసనగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెల్లూరు విఆర్సి సెంటర్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాక్షిగా నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. గడిచిన ఒకటిన్నర సంవత్సరకాలం నుంచి ప్రశ్నిస్తున్న వారిపై.. తెలుగుదేశం పార్టీ దుర్మార్గంగా వ్యవహరిస్తూ అక్రమ కేసులు బనాయించడం జైల్లో పెట్టడం జరుగుతుందన్నారు. ఎవరైనా ప్రభుత్వంపై మాట్లాడితే.. వారి ఇల్లు ధ్వంసం చేయడం, వారి ఆఫీసులపై పడి విధ్వంసం సృష్టించడం లాంటి ఆకృత్యాలకు టిడిపి నేతలు తెగబడుతున్నారని విమర్శించారు. 2014-19 కాలంలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇరిగేషన్ ల్యాండ్‌లో అక్రమంగా




తెలుగుదేశం పార్టీ చేపట్టిన నిర్మాణాన్ని తొలగిస్తే దానిపై ఐదేళ్లు టిడిపి నేతలు అదేదో అన్యాయం అన్నట్లుగా మాట్లాడారన్నారు. ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా.. ప్రభుత్వమే తొలి అడుగు వేయాలన్న ఆలోచనతో ఆ రోజు జగన్మోహన్ రెడ్డి ఆ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఈరోజు తెలుగుదేశం పార్టీ నేతలు చేస్తున్న ఆస్తుల విధ్వంసం, అక్రమ కేసులు బనాయించి వైసిపి నేతలను జైల్లో పెట్టడం చూస్తుంటే.. వారి అరాచకాల పరాకాష్ట ప్రజలకు ఇట్టే అర్థమవుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ చేసిన మోసాలు ప్రజలందరికీ అర్థమై ఈరోజు వారంతా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంట నడుస్తున్నారన్నారు. మళ్లీ ఈ రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన రావాలని ప్రజలంతా ఆకాంక్షిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో ప్రజల ఆకాంక్ష మేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. కూటమి ప్రభుత్వంలో సాగుతున్న దుర్మార్గాలు అన్నిటికీ.. ఆరోజు టిడిపి నేతలు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటి స్థలాల కోసం గ్రామస్తుల విజ్ఞప్తి

**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని మల్లికార్జునపురం గ్రామస్తులు సోమవారం గ్రీవెన్స్ సెల్ సందర్భంగా తహసిల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా గ్రామంలో పలువురికి ఇంటి నివేశనస్థలాలు లేవని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చినట్లు వారు వివరించారు. ఈ మిక్స్ కాలనీలో ఎస్టీలు ఎస్సీలు అనేక మందికి నివేశన స్థలాలు లేవన్నారు. ఎమ్మెల్యే సూచన మేరకు తహసిల్దార్‌కు అర్జీ అందజేశారు.

## స్పోర్ట్స్ స్టేడియానికి వీడిన గ్రహణం

(మొదటి పేజీ తరువాయి)

ఈ నిధులతో పనులు ప్రారంభించాలని ఆయన అధికారు లను ఆదేశించారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు సంబంధిత అధికారులకు మంత్రి ఆనం దిశా నిర్దేశం చేశారు. మాస్టర్ ప్లాన్, అంచనా లు, టెండర్ల ప్రక్రియ పై స్పోర్ట్స్ అథారిటీ అధికారు లతో సుదీర్ఘంగా చర్చించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వారికి తగిన ఆదేశాలిచ్చారు.

## సీఎం పాలనా దక్షతతో రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ

(మొదటి పేజీ తరువాయి)

నిరంతరం జరిపిన సంప్రదింపులతో ఇది సాధ్యమైందన్నారు. సీఎం చంద్రబాబు దూరదృష్టితో ఏపీ మళ్లీ దేశంలోనే నెంబర్ వన్ అవుతోందని చెప్పారు. ప్రభుత్వం తొలుత 8 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తే.. అంతకుమించి 13.25 లక్షల కోట్లు రావడం గొప్ప విషయమన్నారు. వీటి ద్వారా దాదాపు 16 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. పేపర్లపై కాకుండా భూమిపై శంకుస్థాపనలు చేసి పూర్తి చేసేలా కంపెనీలను ఫాలోఅప్ చేసి ఏర్పాటు చేస్తున్న ఘనత ప్రభుత్వానికే దక్కుతుందని వివరించారు. అలాగే జిల్లాస్థాయి లో 6,815 కోట్ల పెట్టుబడుల ద్వారా 4800 మందికి ఉద్యోగాలు రానున్నాయని వెల్లడించారు. జిల్లాలో జేఎం బాక్సీ గ్రూప్ సంస్థ 3 వేల కోట్లతో మెరైన్ సర్వీస్, లాజిస్టిక్, పోర్ట్ బేస్డ్ కంపెనీ ఏర్పాటు అవుతుందని చెప్పారు. దీని ద్వారా 3 వేల మందికి ఉద్యోగాలు రానాన్నుయని చెప్పారు. 2,200 కోట్లతో ఇండోసోల్ కంపెనీ ఏర్పాటు కానుండగా 500 మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. ఐటీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ ఆర్‌సీఆర్‌టీ 1615 కోట్లు పెట్టుబడులు పెట్టనుందని, దీని ద్వారా 1300 మంది ఉద్యోగాలు పొందుతారని వెల్లడించారు. త్వరలోనే గ్లాస్ తయారీ కంపెనీలు రాబోతున్నాయన్నారు. గత ప్రభుత్వ విధానాలతో రాష్ట్రం వదిలి వెళ్లిపోయిన పరిశ్రమలు ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, లూలూ, బిఆర్ శెట్టి గ్రూప్ టైటాన్ వంటివి తిరిగి రాష్ట్రానికి వస్తున్నాయంటే అది చంద్రబాబు పాలనా నైపుణ్యమని చెప్పారు. 2029 నాటికి రాష్ట్రం దేశంలోనే తొలిస్థానంలో ఉండేలా అభివృద్ధి చేయనున్నారని చెప్పారు. మిగతా రాష్ట్రాలు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై ఉంటే.. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు రాష్ట్రాన్ని తీసుకువెళుతున్నారని వివరించారు. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని, జిల్లాను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అందరి భాగస్వామ్యంతో జిల్లాను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. గత 17 నెలలుగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారని, ఈ పెట్టుబడుల ప్రవాహాన్ని చూస్తుంటే ఇది సరికొత్త ఆంధ్రప్రదేశ్ అని నమ్మకం కలుగుతోందన్నారు. అనుభవం, అడ్మినిస్ట్రేషన్‌కు ఇది నిదర్శనమని చెప్పారు. పెట్టుబడులపై వైసీపీ నాయకులు లేనిపోని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, అయినా కూడా పెట్టుబడిదారులు వెనక్కి తగ్గకుండా భారీగా తరలివచ్చారన్నారు. కేవలం ఒక ప్రాంతానికే ప్రాధాన్యం ఇవ్వకుండా మూడు ప్రాంతాలకు సమ ప్రాధాన్యత ఇస్తూ కంపెనీలను తీసుకువచ్చారని ఆమె స్పష్టం చేశారు. ఇంత భారీ స్పందన ఊహించలేదని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ 20 లక్షల ఉద్యోగాలు సాధించేందుకు చేరువలో ఉన్నామన్నారు. గత ప్రభుత్వం పేపర్లపై పెట్టుబడులు చూపిస్తే.. కూటమి ప్రభుత్వం వాస్తవ పెట్టుబడులు చూపుతోందన్నారు. ఇది మంచి ప్రభుత్వమని, పేదల ప్రభుత్వమన్నారు. అన్యాయం, అక్రమాలు లేకుండా పాలన సాగిస్తున్నారని చెప్పారు. రైతుల కోసం ఈ నెలలోనే రెండో విడత అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ యోజన నిధులు జమ కానున్నాయని చెప్పారు. అభివృద్ధిలో అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. కోవూరు నియోజకవర్గంలో కంపెనీలు తెచ్చి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా పనిచేస్తున్నామన్నారు. నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ డైరెక్టర్ వీరేంద్ర నాయుడు, సాగునీటి సంఘ అధ్యక్షులు బత్తల హరికృష్ణ, టీడీపీ నాయకులు వంశీరెడ్డి, ఇందుకూరుపేట మండలపార్టీ అధ్యక్షులు పవన్‌కుమార్‌రెడ్డి, కే.వి శేషయ్య, శ్యాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'డయల్ యువర్ ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ'కి స్పందన




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఏపీ ఎస్పీడీసీఎల్ నిర్వహిస్తున్న 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమం జరిగింది. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా నెల్లూరు జిల్లా నుండి 8 మంది వినియోగదారులు విద్యుత్ సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు, విద్యుత్ లైన్ మార్పు, కాలిపోయిన/చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, లో-ఓల్టేజ్ సమస్య, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, ఇనుప విద్యుత్ స్తంభాల మార్పు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తదితర సమస్యలు వీటిలో ఉన్నాయి. ఈ అంశాలపై వారికి సీఎండీ శివశంకర్ లోతేటి సమాధానమిస్తూ.. వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే, సాధ్యాసాధ్యాలను పరిశీలించి, వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామని వివరించారు. గతంలో 'డయల్ యువర్ సిఎండీ' ద్వారా తమ దృష్టికి వచ్చిన సమస్యలలో అధిక శాతం సమస్యల్ని ఇప్పటికే పరిష్కరించామన్నారు. సాంకేతికపరమైన అడ్డంకులున్నవి మాత్రమే పెండింగులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ కె.గురవయ్య, డైరెక్టర్/ ఫైనాన్స్ (ఎఫ్ఏసి) కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు పి.హెచ్. జానకి రామ్, జె.రమణా దేవి, ఎన్. శోభావాలెంటీనా, కె.ఆదిశేషయ్య, యం.మురళీకుమార్, పి.సురేంద్ర నాయుడు, జనరల్ మేనేజర్లు చక్రపాణి, రాజశేఖర్ రెడ్డి, సురేంద్ర రావు, భాస్కర్ రెడ్డి, ప్రసాద్, వెంకట రాజు, విజయన్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యసాధనలో స్పీడ్ పెంచిన మంత్రి నారాయణ

(మొదటి పేజీ తరువాయి)

తరహాలో మరో పదిహేను హైస్కూల్స్‌ని తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలియజేశారు. నెల్లూరు నగరంలోని 45వ డివిజన్ కర్నాల మిట్ట ఎంసిహెచ్ఎస్, 6వ డివిజన్ వైవిఎం పాఠశాల, 7వ డివిజన్ బివిఎస్, 9వ డివిజన్ ఎంసిహెచ్ఎస్, చిన్నబలయ్య నగర్ హైస్కూల్స్‌ని మంత్రి నారాయణ సోమవారం ఉదయం ఆకస్మికంగా పరిశీలించారు. ఆధునీకరణ పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. అదనపు భవనాల నిర్మాణం, ప్లే గ్రౌండ్ ఏర్పాటుకు డిజైన్లు సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. గతప్రభుత్వం విద్యావ్యవస్థను అధోగతిపాలు చేసిందని ధ్వజమెత్తారు. స్కూల్స్‌ని మూసేయటం తప్ప అభివృద్ధి చేయలేదన్నారు. నేను చదివిన వీఆర్, ఒరుగంటి రుక్మిణమ్మ స్కూల్స్ ని కూడా మూసేసారని మండిపడ్డారు. అయితే యువనేత లోకేష్ సహకారంతో ఇచ్చిన హామీ ప్రకారం వీఆర్‌ని అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రారంభించామన్నారు. అదే తరహాలో మరో పదిహేను హై స్కూల్స్ ని సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఒకటి నుంచి పదోతరగతి వరకు విద్యాభ్యాసం ఉండేలా చేస్తామన్నారు. వచ్చే ఏడాది జూన్ కల్లా అత్యున్నత ప్రమాణాలతో స్కూల్స్ సిద్ధం చేస్తామని తెలిపారు. ఈ స్కూల్స్ లో చదివే పిల్లలకి నారాయణ కాంపిటీటివ్ మెటీరియల్ ఇస్తామని చెప్పారు. అలాగే నిరుపేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ కూడా ఇవ్వమని నారాయణ విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్ రెడ్డిని ఆదేశించామన్నారు. స్కూల్స్ దత్తతకు ముందుకొచ్చిన దాతలకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్ తో పాటు నగర అధ్యక్షుడు మామిడాల మధు ,45వ డివిజన్ అధ్యక్షుడు సుజనా కుమార్,క్లస్టర్ ఇంచార్జి శ్రీకాంత్ రెడ్డి,కో క్లస్టర్ రవి..6వ డివిజన్ అధ్యక్షుడు కొండప్రవీణ్ శంకర్,కో క్లస్టర్ అన్నపూర్ణ,జనరల్ సెక్రెటరీ సాయి కుమార్..వైస్ ప్రెసిడెంట్ విజయలక్ష్మి,7వ డివిజన్ కార్పొరేటర్ మాల్యాద్రి,డివిజన్ ఇంచార్జి సాగర్,యూనిట్ ఇంచార్జి వేణు గోపాల్ రెడ్డి,9వ డివిజన్ క్లస్టర్ ఇంచార్జి బాలాజీ,ప్రెసిడెంట్ పాకాల పెంచాలయ్య యూనిట్ ఇంచార్జి నాగేశ్వర రావు..టీడీపీ ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పొట్టేపాళెం కలుజు మధ్యలో పడిన గుంటను వెంటనే పూడ్పించాలి

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** ప్రమాదకరంగా మారిన నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టే పాలెం నందు నెల్లూరు చెరువు కలుజుకు మధ్యలో పడిన గుంటను వెంటనే పూడి పించాలని, కలుజు ప్రక్కనగల దొంగ తూముకు ప్రొటెక్షన్ వాల్స్ నిర్మించాలని కోరుతూ సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌ని కలిసి వినతిపత్రం అందించడం జరిగింది. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు, మండల కార్యదర్శి పి.జనార్ధన్‌లు మాట్లాడుతూ.. కలుజు మార్గం గుండా ప్రతినిత్యం జిల్లాలోని 5 నియోజకవర్గాల ప్రజలు వందలాది వాహనాలలో వేలాదిమంది ప్రయాణిస్తుంటారని, నరసింహకొండ, జొన్నవాడ కామాక్షి తాయి, పుణ్యక్షేత్రాలకు అనేకమంది భక్తులు ప్రయాణిస్తుంటారని అయితే కలుజు నుంచి పెన్నా నదిలోకి నీళ్లు ఎక్కువగా ప్రవహిస్తున్నందు వల్ల రాక పోకలకు తీవ్ర అంతరాయంగా మారిందని దీనితోపాటు కలుజు మధ్యలో గుంటపడడంతో గుంట కనపడక అనేక మంది వాహనాలలో ప్రయాణించేవారు గుంతలో పడిపోతున్నారని దీనితో గాయాల పాలవుతు న్నారని అన్నారు. గుంట ఉన్నందువల్ల కలుజుకు ఒకే వైపు వెళ్లాల్సి వస్తుం దని రెండో వైపు వెళితే నీటి ప్రవాహం వల్ల కలుజు పాచి పట్టి పోవడంతో నీళ్లలో పడిపోతున్నారని కాబట్టి కలుజు మధ్యలో పడిన గుంటను వెంటనే పూడిపించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని కోరారు. అలాగే దొంగ తూముకు గత ఆరు నెలలుగా ప్రొటెక్షన్ వాల్స్ పడిపోవడం వల్ల వాహనాలలో ప్రయాణించేవారు 10 అడుగుల లోతు గల తూములో పడిపోతున్నారని ఈమధ్య ద్విచక్ర వాహనంలో ప్రయాణించే ములిమూడి గ్రామానికి చెందిన మన్నేపల్లి సుధాకర్ ఈ తూములో పడిపోయి మరణించి నాడని కాబట్టి ప్రమాదాలను అరికట్టేందుకు వెంటనే దొంగతూముకు ప్రొటెక్షన్ వాల్స్ నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పాదర్తి మస్తానయ్య, శ్రీపతి వెంకయ్య, బద్దిపూడి వెంకటసుబ్బయ్య, శివ, శివాజీ బోధి తదితరులు పాల్గొన్నారు.

## క్షణికావేశానికి యావజ్జీవం.. అన్నను హత్య చేసిన తమ్ముడు

**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** ఆస్తి తగాదాలలో సొంత అన్నను ఇనుప రాడ్‌తో దారుణంగా కొట్టి, అతన్ని హత్య చేసినట్లు నమోదైన కేసులో తమ్ముడు పాముల శీనయ్యపై ఆరోపణలు రుజువై నందున అతనికి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు వివిధ సెక్షన్ల కింద 2,000 జరిమానా విధిస్తూ నెల్లూరు 3వ అదనపుజిల్లా సెషన్స్ జడ్జి ఎల్ తేజోవతి సోమవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణపట్నం పోర్టు పోలీస్ సర్కిల్ పరిధిలోని ముత్తుకూరు మండలం రొయ్యలపాలెం గ్రామానికి చెందిన పాముల సుబ్రహ్మణ్యంకు, అతని తమ్ముడు నిందితుడు పాముల శీనయ్యకు ఆస్తికి సంబంధించి ఇరువురి నడుమ తగాదాలు ఉండేవి. ఆస్తులకు సంబంధించిన గొడవల్లో నిందితుడు శీనయ్య స్వంత అన్నపై తీవ్రంగా కక్ష పెంచుకొన్నాడు. ఈ నేపథ్యంలో 2022 సంవత్సరం ఏప్రిల్ 24న నిందితుడు శీనయ్య ఆగ్రహంతో తన అన్న సుబ్రహ్మణ్యంపై ఇనుప రాడ్డుతో దాడి చేసి అతని తల పగలగొట్టాడు. ఇనుపరాడు దెబ్బలకు తీవ్ర రక్త గాయాలైన సుబ్రహ్మణ్యం కింద పడిపోయాడు. సంఘటనతో ఆగ్రహం చల్లారని నిందితుడు శీనయ్య తన అన్న అత్త ఇంటిని కూడా తగలబెట్టాడు. తీవ్రగాయాలైన సుబ్రహ్మణ్యంను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన 2022 మే 7న మరణించాడు. దీనిపై పోలీసులు నిందితుని పై కేసు నమోదు చేసి విచారణ అనంతరం కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం న్యాయమూర్తి పై మేర తీర్పు చెప్పారు. అప్పటి సీఐ వేమారెడ్డి దర్యాప్తు చేయగా ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెంచు కృష్ణ వాదించారు.

## భూ ఆక్రమణల నుంచి మాకు న్యాయం చేయండి



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలం మొలకల పుండ్ల గ్రామం పరిధిలోని సర్వే నెంబరు 500-2బీ ఉన్న పట్ట భూమిని పోలిశెట్టి శ్రీనివాసులు అనే వ్యక్తి ద్వారా చెరుకూరు స్థానికులైనటువంటి కర్లపూడి వాణి, హరిప్రసాద్‌కి రిజిస్టర్ అయిన మా భూమిని కొంతమంది ఆక్రమించారాని సంబంధిత భూ యజమాని తాలూకు భర్త హరిప్రసాద్ మీడియా ముఖంగా తెలియజేశారు. అప్పటి తహసిల్దార్ ప్రవీణ్ కుమార్ ఉన్న సమయంలో నక్కి బోయిన వెంకటేశ్వర్లు, మల్లారపు చిన్న పెంచలయ్య, వరికోటి శంకరయ్య, అను వారి పేర్లు మీద ఎటువంటి డాక్యుమెంట్లు లేకుండా వారసత్వం ఉన్నట్లు వెబ్ ల్యాండలో ఆడంగళ్‌లో చూపడంతో, అది తెలుసుకున్న మేము న్యాయం చేయమని రెవెన్యూ కోర్టు ఆశ్రయించిగా సంబంధిత హైకోర్టు వారు జారీ చేసిన ఉత్తర్వులు అనుసరించి పూర్వపు స్థితిని కొనసాగించవలసినదిగా కోర్టు ఇంటీరియమ్ ఆర్డర్ ఇచ్చి, కోర్టు ఉత్తర్వులు అధిగమించిన వారిపై పోలీస్ సాయంతో చర్య తీసుకోవా ల్సినదిగా సైదాపురం తహసిల్దారుకు ఉత్తర్వులు జారీ చేశారని, అందులో భాగంగా సదరు విషయమై కోర్టు ఆర్డర్ను సైదాపురం తహసిల్దార్‌కి ఆర్డర్ కాపీనీ ఇచ్చి సదరు విషయంలో మాకు తగు న్యాయం జరిపించాలని వినతిపత్రం అందజేశమన్నారు.

## నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** తిరుపతికి చెందిన న్యాయవాది రాజశేఖర్ రెడ్డిపై ఒక కేసులోని వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన నిర సిస్తూ నెల్లూరు న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులు బహిష్కరిం చాలని నిర్ణయించారు. సోమవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన అత్యవసర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసు కున్నట్లు నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులిమి అయ్యప్ప రెడ్డి, జనరల్ సెక్రెటరీ నాగరాజు తెలిపారు. కోర్టు విధుల బహిష్కరణ కార్యక్రమానికి న్యాయవాదులు అందరూ సహకరించాలని వారు కోరారు.

## ఇంటి స్థలాల కోసం తహసిల్దార్‌కు వినతి



**తోటపల్లి గూడూరు, మేజర్ న్యూస్ :** మండలంలోని మల్లికార్జునపురం గ్రామ స్తులు సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా తహసిల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి పర్యటన సందర్భంగా గ్రామంలో పలువురికి ఇంటి నివేశనస్థలాలు లేవని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చినట్లు వారు వివరించారు. ఈ కాలనీలో ఎస్టీలు ఎస్సీలు అనేక మందికి నివేశన స్థలాలులేవన్నారు. ఎమ్మెల్యే సూచన మేరకు తహసిల్దార్‌కు అర్జీ అందజేశారు.

## యాచకుడు అనుమానాస్పద మృతి



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాకూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో సోమవారం యాచకుడు అనుమానాస్పదంగా మృతి చెందారు. రాపూరు ఏఎస్ఐ వెంకటేశ్వరరావు అందించిన సమాచారం మేరకు వివరాలు ఎలా ఉన్నాయి. పెంచలకోన బస్సు సెంటర్ వద్ద రోజు వారీగా యాచక వృత్తిని చేపట్టే వృద్ధుడు సోమవారం అనుమానస్పదగా మృతి చెందాడు. స్థానికులు గుర్తించి వీఆర్వోకి సమాచారం అందించగా స్థానిక వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకొని అనుమానస్పదంగా మృతి చెందిన వృద్ధుడు పార్థివదేహాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

# నవకోటి సిద్దేశ్వర స్వామి కోనలో పోటెత్తిన జనం



### కార్తీకమాస నవకోటి సిద్దేశ్వర స్వామి నవనాథ సిద్దేశ్వరస్వామి సారంగదరుడు తిరణాలు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** దైవాంశ సంభు తులైన ఇద్దరు దివ్య పురుషులు శ్రీ నవకోటి సిద్దేశ్వరులు నవనాథ సిద్దేశ్వరులు అనే యోగేశ్వర్లు లోకకళ్యాణార్థం దేశ సంచారం చేస్తూ సుమారు 800 సంవత్సరాల క్రితం ఈ ప్రాంతానికి వచ్చారు. మానవ సంచా రానికి దూరంగా క్రూర మృగాలు సంసరిం చే ఇక్కడ భయంక అరణ్యంలో ఆ మహాత్ములకు ప్రశాంతంగా పవిత్రంగా పరమపద సాధనకు యోగ్యమైన ఆధ్యాత్మిక కేంద్రంగా గోచరిస్తుంది. అయితే అలా వారి మనసులను ఎంతో ప్రభావితం చేసిన ఈ కొండ కోనల యందు కొంతకాలం తపస్సు చేయు సంకల్పించి ఇక్కడ సహజ సిద్ధంగా ఏర్పడ్డ పంచదనుల్లో స్నానం ఆచరించి సుచయై ఒక పెద్ద చెట్టు బండ కింద తపోదీక్షతో నిమగ్నమై ఉండగా అలా కొంతకాలం గడుస్తూ ఉంటూ ఒకరోజు ఈ ప్రాంతానికి చెందిన సారంగడు అనే గిరిజనుడు అడవిలో వేటాడుకుంటూ తన బాణవేటు నుండి తప్పించుకున్న ఒక లేడీని వెంటా డుతూ ఈ కొండపైకి వచ్చేసరికి తపోదీక్షలో ఉన్న ఆ మహాత్ములు సారం గా దరుడు కంటపడ్డారు సారంగడు ఆశ్చర్యానికి లోనై వారి వైపు వచ్చి చూడగా వెనుక ఏదో దివ్య శక్తి వెలుగుగా సాక్షాత్తు భగవత్ స్వరూపులుగా భావించి భక్తితో నమస్కరించి వారి కటాక్షములకై 9 రోజులు పాటు నిద్రా హారాలు విడి ఇల్లు భార్య బిడ్డలను వదిలి వారి ఎదురుగా కూర్చుని నిరీక్షి స్తుంటాడు. అలా ఆ దివ్య పురుషులు ధ్యానం నుండి లేచే వరకు అక్కడే నిరీక్షిస్తున్న సారంగధరడు అలా వారి అనుగ్రహానికి పాత్రుడైన సారం గదరుడు ఎంతో సంతోషపరుడై వారి సేవలో స్వయంభువై నిలిచి ఉన్నారు. వీరు ముగ్గురు భక్తుల యొక్క కోర్కులు ఏడుస్తూ సిద్దేశ్వర కోణంలో కొలు వైనారు వీరిని కులదైవంగా భావించే బలిజ సామాజిక వర్గం వారు ప్రతి కార్తీక సోమవారాలలో ఉభయములను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ చివరి కార్తీక సోమవారం స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహించి స్వామిలను అలంకారులతో ఎంతో అంగరంగ వైభవంగా శ్రీ నవకోటి సిద్దేశ్వర స్వామి ఈ నవనాథ సిద్దేశ్వర స్వామి వారి ప్రియ శిష్యుడు సారంగదరుడును గ్రామంలో ఊరేగా ఉత్సవం ఘనంగా నిర్వహిస్తారు.

ఇదంతా కూడా సైదాపురం మండలంలోని మొలకల పూండ్ల పంచాయతీ పరిధిలో గల శ్రీ సిద్దేశ్వర స్వామి కోనలో చివరి కార్తీక మాసం సందర్భంగా నాల్గవ సోమవారం. ఆధ్యాత్మికంగా దివ్యమైనది కార్తీక మాసం. ఈ కార్తీక మాసంలో మహిళలు భక్తి శ్రద్ధలతో పూజ కార్యక్రమాలు చేయడం జరిగింది. మాసాలన్నిటిలో ఉత్తమైన మాసంగా కార్తీక మాసాన్ని చూస్తారు. ఈ మాసంలో శివ కేశవులను భక్తులు పూజిస్తారు. సూర్యోదయానికి ముందే బ్రహ్మ ముహూర్తంలో అభ్యంగన స్నానం చేస్తారు. కార్తీక మాసంలో దీపం వెలిగిస్తే ఎంతో శుభకరమని భక్తులు నమ్మకం. ఇక ఈ మాసంలో శ్రీ నవకోటి సిద్దేశ్వర స్వామి కోనలో గల ఆలయాలు భక్తులతో రద్దీగా మారింది.

ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోని భక్తులు కార్తీక మాస శోభ సంతరించుకుంది. ఆలయాల్లో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇక భక్తులు తెల్లవారుజామునే ధ్వనుల్లో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ సిద్దేశ్వర స్వామి కోనలో కార్తీక మాసం పూజల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామి దర్శనార్థం జనం పోటెత్తారు. ఈ క్రమంలో సోమవారాల్లో శివారాధన చేస్తే



మనఃశాంతి కలుగుతుందని భక్తుల నమ్మకం. ఇదిలా ఉంటే.. ఏపీలోని పలు ప్రాంతాల నుండి శ్రీ నవకోటి సిద్దేశ్వర స్వామి కోనలో కార్తీక మాసం మూడవ సోమవారం ప్రారంభం సందర్భంగా భక్తుల రద్దీ పెరిగింది. ఈ క్రమంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ దేగ రమణయ్య ఆలయ కమిటీ సిబ్బంది. శ్రీ సిద్దేశ్వర స్వామి కోనకు వచ్చేటువంటి భక్తులకు ఇటువంటి ఇబ్బందులు కలగకుండా భక్తులకు కావలసిన మౌలిక సదుపాయాలు అన్నదాన కార్యక్రమాలు, నీటి సౌకర్యం, భక్తులు తొక్కేసి ఆటో లేకుండా వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసి పోలీసు బృందం ద్వారా తగు చర్యలు తీసుకొని భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకున్నామని ఆలయ కమిటీ చైర్మన్ దేగ రమణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసుల పాత్ర చాలా కీలకమైనదని వారు వచ్చేటువంటి భక్తులను, ట్రాఫిక్‌లను సమర్థవంతంగా నిబద్ధత నిలిచి కృషి చేశారని అదే విధంగా, వచ్చేటటువంటి ప్రతి భక్తుడికి దర్శనం నిదానంగా దర్శించుకునేలా ఏర్పాటు చేసి చర్యలు తీసుకున్నామని భక్త బృందానికి ఎక్కడ ఎటువంటి అవంతర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దేగ రమణయ్య, ఆలయ కమిటీ సభ్యులు, వాలంటీర్స్, పోలీస్ సిబ్బంది, సర్పంచ్ వెందోటి శారద, ఉప సర్పంచ్ బులిగర్ల శివకుమార్ యాదవ్, అక్కని సతీష్, పొక్కాలా ప్రసాద్, వాసు, పట్నం గోపి, సర్పంచ్ భర్త రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గొలగమూడి ఆశ్రమ సేవలు ఆదర్శప్రదం : ఎమ్మెల్యే సోమిరెడ్డి



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** మండలం గొలగమూడిలోని శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి ఆశ్రమంలో నిర్వహించిన కార్తీక వనభోజనాల కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. వెంకయ్య స్వామిని దర్శించుకున్న ఆయన, ఆశ్రమ ట్రస్టు చేపట్టిన అనేక సేవా కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడు తూ.. టీటీడీ జేఈఓగా అనేక సంవత్సరాలు సేవ చేసిన బాలసుబ్రహ్మణ్యం, ప్రస్తుతం ఒక్క రూపాయి జీతం కూడా తీసుకోకుండా ఆశ్రమ సేవలో నిమగ్నమై ఉండటం గొప్ప విషయం. ఆశ్రమ అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులను సమకూర్చడంతోపాటు హాస్టల్, హాస్పిటల్, స్కూల్ భవనాలను అద్భుతంగా నిర్మించారు. రూ. 1.50 కోట్లు వెచ్చించి గొలగమూడిలో సిమెంట్ రోడ్లు నిర్మించడం, సొంతంగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం గ్రామాభివృద్ధికి ఎంతో దోహదం చేసింది. ఏటా 10లక్షల మందికి అన్నప్రసాదం అందించడం అత్యంత సేవాభావానికి నిదర్శనం. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జగదీష్ ప్రతి నెల ఆశ్రమానికి వచ్చి పేదలకు వైద్యసహాయం అందించడం ప్రశంసనీయం. కృత్రిమ అవయవాల తయారీ, పంపిణీతో అనేకమందికి నూతన జీవం లభిస్తోంది. భక్తుల కోసం ధ్యానమందిరం, వసతి కాటేజీలను అందుబాటులో ఉంచడం గొప్ప సేవ. ఐఏఎస్ ఉద్యోగ విరమణ అనంతరం టాటా కంపెనీలో పనిచేసిన బాల సుబ్రహ్మణ్యం, ఆ సంస్థ సహకారంతో రూ. 1 కోటి వ్యయంతో హాస్టల్ భవనం నిర్మించడం ప్రత్యేకం. అంతిమంగా, భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి ఆశీస్సులు రాష్ట్రానికి, ప్రజలందరికీ కలగాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆకాంక్షించారు.

# శ్రీ మల్లికార్జుని సన్నిధిలో మహారుద్ర హోమం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జొన్నవాడ శ్రీ కామాక్షితాయి సమేత శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం నందు కార్తీక మాసం నాల్గవ సోమవారం సందర్భంగా ఆలయ ప్రాంగణం నందు ఆలయ అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణ లతో ఉదయం మహారుద్ర హోమం, సాయంత్రం అధికార రాతి నందీశ్వరునికి ప్రదోషకాల అభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. రుద్ర హోమం కార్యక్రమానికి నెల్లూరు వాస్తవ్యులు తుమ్మగుంట రమణయ్య నాయుడు, విమలమ్మ దంపతులు వారి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ముందుగా ఉదయం ప్రధాన ఆలయంలో గణపతి పూజ, శ్రీ స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు జరిపించి మంగళ వాయిద్యాల నడుమ పూజా ద్రవ్యములతో ఆలయ ప్రదక్షిణ చేసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమగుండం వద్ద గణపతి పూజ, పుణ్యాహవాచనం కార్యక్రమాలతో హోమం ప్రారంభించడం జరిగినది. తదుపరి అగ్ని ప్రతిష్ఠ, అగ్ని సంస్కారం, లక్ష్మీ గణపతి హోమం, నక్షత్ర సహిత నవగ్రహ హోమం, 11 మంది రుత్వికులు చే మహా రుద్ర హోమం, శ్రీ సూక్త దుర్గాసూక్త సహిత ఖడ్గమాల హోమం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు వేద మంత్రోచ్చారణలతో అత్యంత వైభవంగా జరిగింది. త్రయోదశి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ అధికార రాతి నందీశ్వరునికి ఏకాదశ ద్రవ్యాలు ప్రత్యేక పుష్పాలంకరణతో అభిషేక కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగినది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి, కార్యనిర్వహణాధికారి శ్రీ అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, పాలక మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహంపై ప్రభుత్వం చేస్తున్న వింత చేష్టలు మానుకోరా !



**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి గత వైసిపి ప్రభుత్వం విజయవాడలో స్వరాజ్ మైదానంలో భారీగా అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మిస్తే.. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం అందులో పని చేయుచున్న 19 మందిని సాంస్కృతిక శాఖ ద్వారా కాంట్రాక్టు పద్ధతిలో పారిశుధ్యన్ని నిర్మించుటకు నియమిస్తే 19 మందిని తొలగించడం అంబేద్కర్ విగ్రహాన్ని పట్టించు ప్రభుత్వం పట్టించుకోక పోవడం అన్యాయమని దళిత సంఘర్షణ సమితి అధ్యక్షులు ఎస్.మల్లి తెలిపారు. కావలి ఆర్డిఓ కార్యాలయంలో ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డీవోకి వినతి పత్రాన్ని అందించారు. దేశ స్వతంత్ర ఉద్యమ నాయకులను విగ్రహాలను పరీక్షించాల్సిన బాధ్యత ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వాన్ని తెలిపారు. అలాగే జగన్మోహన్ రెడ్డి నియమించారు. మేము పట్టించుకోము అనే విధానం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని తెలిపారు. అలాగే గత వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రస్తుత ప్రభుత్వం 70శాతం నిర్వహిస్తున్నారని, అలాగే సచివాలయ వ్యవస్థనుండి పాఠశాలలు మూడు, నాలుగు, ఐదు, తరగతులు తరలించం లాంటి పథకాలు అమలు చేయడం ఏమిటి అని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అన్ని వర్గాలకు సంబంధించిన అంబేద్కర్ మహోన్నత వ్యక్తిని తెలిపారు. తీసివేసిన 19 మంది కాంట్రాక్టు ఉద్యోగులను తిరిగి చేర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యానాది సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బాపట్ల సత్యవతమ్మ ఎమ్మార్పీఎస్ నాయకులు జరుగుమల్లి విజయరత్నం, నరసింహారావు, మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, మస్తానయ్య, జెడ్డా వాసు, విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రంధాలయాన్ని తనిఖీ చేసిన రాష్ట్ర డైరెక్టర్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు ఏ.కృష్ణమోహన్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కే.కుమార్ రాజా సోమవారం సందర్శించారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను, కరెన్సీ ప్రదర్శనను తిలకించారు. అనంతరం డైరెక్టర్ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమాలను గురించి ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ ఓ.శ్రీనివాసరాజును అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయ శాశ్వత భవనానికి కృషిచేసిన విశ్రాంత హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కేవీ శేషారెడ్డిని డైరెక్టర్ సన్మానించారు. ఏఎస్ పేటకు చెందిన ఎండి వాయిజ్ కరెన్సీ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తెలుగు భారతి సేవా సమితి అధ్యక్షులు ఏ.సుబ్బరాయుడు, ఎస్వీ రమణయ్య, కొల్లా వెంకటేశ్వర్లు, విశ్రాంత గ్రంథ పాలకులు ఏ.గోవింద్ రెడ్డి, ఒమ్మిన సుబ్రహ్మణ్యం, స్టూడెంట్స్ మోటివేటర్ వి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## గురప్ప స్వామి ఆలయంలో ఘనంగా పూజలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు నడిమూరు నందు వేంచేసియున్న శ్రీ గురప్ప స్వామి శ్రీ అంకాలమ్మ తల్లి శ్రీ నాగవరపు అమ్మ ఆలయంలో కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి అభిషేకాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. మందహాసంతో సుగంధ భరిత పుష్పమాలలతో స్వామి వారు అమ్మవారు కనువిందు చేశారు. భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మ వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి కరుణా కటాక్షాలను పొందారు. ఈ కార్యక్రమాలను గురువారెడ్డి పర్యవేక్షించారు.

## గ్రంథాలయ పన్నులు వెంటనే జమ చేయాలి

▶ సామాజికవేత్త మాలకొండ రెడ్డి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని మునిసిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్లు పంచాయితీలు వసూలు చేసిన ఇంటి పన్నులు 8శాతం గ్రంథాలయ పన్నులు జిల్లా గ్రంథాలయ శాఖకు జమ చేయాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు ఎం మాలకొండ రెడ్డి ప్రభుత్వాన్ని కోరినారు. 58 వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలలో భాగంగా ఆరెసి 30సి/2007 ఉత్తర్వులు మేరకు డీపీటీ లెక్కల ప్రకారం పంచాయతీలు మున్సిపాలిటీలు వసూలు చేసిన ఇంటి పన్నులు ఎనిమిది శాతమును వెంటనే జమచేసి గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరినారు. గ్రంథాలయాలు పరి పరిపుష్టి కావాలన్నా ప్రజలకు జ్ఞాన సంపదను అందించాలన్న గ్రంథాలయాలను అభివృద్ధి చేసి ప్రభుత్వ భవనాలు లేని చోట ప్రభుత్వ స్థలాలు కేటాయించి నూతన భవనాలను నిర్మించాలని కోరినారు. గ్రంథాలయ బకాయిలును స్థానిక సంస్థల నుండి వసూలు చేసి జిల్లా గ్రంథాలయానికి జమ చేసి వాటి అభివృద్ధికి కృషి చేయవలసినదిగా అధికారులను కోరారు.

## మంత్రి ఆనం ప్రత్యేక చొరవతో బస్సు ఏర్పాటు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి ప్రత్యేక చొరవతో అనంతసాగరం మండలం కచేరి దేవరాయపల్లి, వెంగమ నాయుడు పల్లి గ్రామాలకు బస్ సౌకర్యం ఏర్పడింది. ఈమేరకు సోమవారం గ్రామస్తులు, ఆర్టీసీ అధికారులు బస్సును ప్రారంభించారు. ఈ సేవలో భాగంగా బస్సు రోజుకు మూడు సార్లు ఈ రెండు గ్రామాలకు రాకపోకలు నిర్వహించనుంది. ఈ గ్రామాల ప్రజలకు, మహిళలకు, విద్యార్థులకు ఈ నిర్ణయం విశేష ఉపశమనాన్ని కలిగించిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రైతు సంఘం ఉపాధ్యక్షులు పసుపులేటి ఈశ్వరయ్య, పోతల రామచంద్రయ్య, బొల్లినేని వెంకటనరసయ్య, కరివేటి సుబ్బయ్య, విశ్వనాథం సుబ్బయ్యస్వామి, సోమిశెట్టి మస్తాన్, పూల మురళి, కరివేటి రాజా, ఆళ్ల మాల్యాద్రి, అనుగోలు శంకరయ్య, ఆనందరావు, మల్లిశెట్టి అనంతరావు, కృష్ణ, కరివేటి వెంకటరావు, కరివేటి మల్లికార్జున, పల్లిశెట్టి ప్రసాద్, కరివేటి చంద్రమోహన, జువ్వి రమేష్, తేజ, దీపు, సుధీర్, సాయి, గురుప్రసాద్, షేక్ మాబాషు, రంతుల్లా, పోతల శ్రీనివాసులు, షేక్ చాంద్ బాషా, గౌవస్, షేక్ రసూల, అజ్జర్ డ్రైవర్, కండక్టర్, ఆత్మకూరు ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ సిహెచ్ రాజ కుమార్ పాల్గొన్నారు.

కార్తీక మాసోత్సవాల్లో..

## శ్రీకంఠం నాగలక్ష్మి నాద సేవ



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కార్తీక మాసోత్సవాల్లో భాగంగా సోమవారం బ్రహ్మదేవి కామాక్షితాయి సమేత కైలాస నాధేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీకంఠం నాగలక్ష్మి నాదసేవ చేశారు. ఈ కార్యక్రమానికి ఆలయ అర్చకులు కొత్తపల్లి రమేష్ కుమార్ శర్మ కుటుంబ సభ్యులు సహకారం అందించారు. సుమారు రెండు గంటలపాటు శ్రీ కంఠం వీణ వాయించి ప్రాచీన కళను అలరించినారు. వీణ గానంతో ఆలయ ప్రాంగణం మారు మోగింది. ఈ సందర్భంగా కొత్తపల్లి కుటుంబ సభ్యులు ఆమెకు ఘన సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లోరిన్ రహిత నియోజకవర్గంగా తయారు చేయడమే లక్ష్యం

## రూ.8లక్షలతో నిర్మించిన వాటర్ ప్లాంట్ ప్రారంభం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి నియోజకవర్గం ఫ్లోరిన్ రహిత నియోజకవర్గం గా తయారు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. సోమవారం వింజమూరు మండల పరిధిలోని చాకల కొండ పంచాయతీ పోలినాయుడుపల్లి గ్రామంలో 8లక్షల రూపాయల జిల్లా పరిషత్ నిధులతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదగా ప్రారంభించారు. రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మహిళలకు బిందెలతో నీటిని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 70 మినరల్ వాటర్ ప్లాంట్లను నియోజకవర్గ వ్యాప్తంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫ్లోరిన్ రహిత నియోజకవర్గంగా తయారు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ గ్రామంలో 45 కుటుంబాలు ఉన్నాయని మారుమూల గ్రామమైనందున 8 లక్షల రూపాయలతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల నుండి మండల కేంద్రాలకు లింక్ రోడ్స్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రహదారి వ్యవస్థ బాగుపడితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మంత్రి నారా లోకేష్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తుందని, ఇప్పటికే పలు దేశాల నుండి పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. నాయకులందరూ సమిష్టిగా కృషిచేసి గ్రామాలను ప్రగతి పథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామస్తులు ఇచ్చిన అర్జీలను స్వీకరించి, వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, మండల ఉపాధ్యక్షులు అనంగి రమణయ్య, సీనియర్ నాయకులు, వనిపెంట సుబ్బారెడ్డి, యన్నం రామచంద్రారెడ్డి, కూనల వెంకటేశ్వర్లు, సర్పంచ్ ఉప్పి రెట్ల విజయలక్ష్మి, ఉప్పిరెట్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ సభ్యులు దిండు మహేష్, నారాయణ, సొసైటీ డైరెక్టర్ కోడూరు నాగిరెడ్డి, తోడేందుల చెంచయ్య యాదవ్, బి.గోపాల్, తోడందుల నాగరాజు, తల్లపనేని మాల కొండయ్య, గడ్డం రమణయ్య, పోలుబోయిన గోపి మబ్బు వెంకటేశ్వర్లు, మాసునూరి మల్లికార్జున, ఎస్‌కె కాసిం కొండపల్లి వెంకటేశ్వర్లు, బీజేపీ మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, వంశి, తిరుపతి ఆచారి, ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి శేఖర్, వింజమూరు పంచాయతీ కార్యదర్శి రామారావు, ఆర్డబ్ల్యూఎస్ డీఈ, ఏఈ, వీఆర్వో గ్రామ మహిళలు ఉన్నారు.

# బీసీ భవన్ నిర్మాణానికి చర్యలు చేపట్టండి : కాంగ్రెస్



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు కొండయ్య పాలెం సెంటర్ వద్ద బీసీ హాస్టల్ ప్రాంగణంలో బీసీ భవన్ నిర్మాణానికి వెంటనే చర్యలు చేపట్టాలని నెల్లూరు సిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కే.సంజయ్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఆ ప్రాంతాన్ని సందర్శించడం జరిగిందని గత వైసీపీ ప్రభుత్వం 2021లో సుమారు 5.40 కోట్లతో బీసీ భవన్ నిర్మాణానికి తలపెట్టిన శిలాఫలకం శిల లాగా ఉండిపోయిందని, పునాదులకు వేసిన స్టీల్ రాడ్స్ చిలుము పట్టి పనికిరాకుండా పోతున్నాయని, ఎక్కడ చూసినా ముళ్ళ తుప్పలు డంప్ యార్డ్ లాగా ఆ ప్రాంతం ఉందని, అయినా ప్రభుత్వాలు మారినా బీసీ భవన్ గురించి పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని ఆరోపించారు. రాష్ట్రానికి బీసీ మంత్రి కూడా ఎవరో తెలియని పరిస్థితి నెలకొందని వివరించారు. అదేవిధంగా ఇది బిసి ప్రభుత్వం అని గొప్పలు చెబుతున్నారు. తప్ప బీసీలకు ఒరిగిందేమీ లేదని దుయ్యబెట్టారు.ప్రక్కనున్న బీసీ హాస్టల్‌లో ఎలాంటి సదుపాయాలు లేకుండా ఉన్నాయని, దుర్గంతపూరితమైన వాసన హాస్టల్లోకి అడుగుపెట్టగానే వస్తుందని, అక్కడే విద్యార్థులకు మెస్ ఉందని, పేద బీసీ విద్యార్థులంటే ఎందుకు అంత చులకన అని సంజయ్ ప్రశ్నించారు. అంతేకాకుండా ఇలాంటి పరిసరాలలో విద్యార్థులు ఎలా చదువుకోగలరని కనీసం అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదని ఎద్దేవా చేశారు. సిటీ కాంగ్రెస్ లీగల్ సెల్ అడ్వకేట్ సుధీర్ మాట్లాడుతూ.. తాము బీసీల పక్షపాతులమని చెప్పుకునే కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి బీసీ భవన్ నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో మత్స్య కళాశాల విద్యార్థులు ప్రతిభ



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ స్థాయిలో ముత్తుకూరు మండల కేంద్రంలోని మత్స్య కళాశాల విద్యార్థిని విద్యార్థులు ప్రతిభను చాటుకుని శభాష్ అనిపించారు. ఈ విషయాన్ని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ధనపాల్ సోమవారం తెలియజేశారు. జాతీయ మత్స్య అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో ఈనెల 10, 13 తేదీల్లో జరిగిన ప్రపంచ ఆక్వా కల్చర్ 2025 సొసైటీ రాష్ట్రీయ కార్యక్రమంలో ముత్తుకూరు మత్స్య కళాశాల నుంచి ముగ్గురు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో ఉన్నటువంటి వినూత్నమైన ఆలోచన విధానాన్ని ప్రపంచానికి తెలియజేసే క్రమంలో థింక్ -ఠాన్ పోటీలు అక్కడ నిర్వహించగా కళాశాల విద్యార్థులు తమ విద్య నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఎంఎఫ్ఎస్‌సి మొదటి సంవత్సరం విద్యార్థులు పడాల సాయి చందు, సగిలి మేఘన, బిఎఫ్ఎస్‌సి మూడో సంవత్సరం విద్యార్థిని కార్లపూడి ప్రవీణలు ప్రతిభను వ్యక్తపరిచారు. బ్రెజిల్, ఫ్రాన్స్ కంపెనీలు తయారు చేసిన ఉత్పత్తులను రైతులకు ఎలా అందించాలి, బయోమాస్‌ను ఆధునిక పద్ధతిలో కాకుండా సాంప్రదాయ పద్ధతిలో ఏ విధంగా లెక్కించాలి, సమస్యలు పరిష్కారానికి మార్గం ఏమిటి అనే అంశాల పైన క్షేత్రస్థాయిలో సమగ్రంగా అంతర్జాతీయ వేదిక ద్వారా సమగ్రంగా చెప్పారు. వివరణాత్మక సందేశంతో పలువురు అభినందించారు. సహాయ ఆచార్యులు ఆనంద్ ప్రసాద్ ప్రతిభ చాటిన ముగ్గురు విద్యార్థులను అభినందించి ప్రశంసించారు. విద్యార్థులకు భారతీయ కరెన్సీలో ఒక్కొక్కరికి రూ.14,520 రూపాయలు నగదు బహుమతులు అందుకున్నారని కళాశాల డీన్ తెలిపారు.

## అడవి పేరాటలమ్మ నగర్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గన్నేపల్లి పంచాయతీ అడవి పేరంటాలమ్మ తల్లి దేవాలయంలో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా పివిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల్లూరు మెడికవర్ వైద్యశాల, ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల సహకారంతో ఉచిత జనరల్, నేత్ర వైద్య శిబిరం జరుగింది. ఈ శిబిరంలో సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు నిర్వాహకులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ క్యాన్సర్ వైద్యశాలకు లక్ష విరాళం



**కావలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలో క్యాన్సర్ నివారణ కేంద్రం నిర్మాణంలో ఉన్నది ఈ నిర్మాణానికి కావలి ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షుడు గాదంశెట్టి మధుసూదన్ రావు కుమారుని జన్మదిన సందర్భంగా కావలి ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షులు తటవర్తి రమేష్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యులకు లక్ష రూపాయలు అందజేశారు. అనంతరం వారిని వారి కుమారుడు సత్యశ్రీ రాజ్, చరిత దంపతులను రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం సత్యశ్రీ రాజ్ రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ హరినారపురెడ్డి, సభ్యులు రోటేరియల్ ఏ.రమేష్‌రెడ్డి, ప్రముఖ రొటేరియల్ రవికుమార్, వెంకటసుబ్బయ్య, సురేష్ రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు నెల్లూరు రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి కోఆర్డినేటర్ శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జవహర్ భారతి గ్రౌండ్స్‌లో ఇంటర్ కాలేజీ క్రీడలు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో సోమవారం డాక్టర్ డిఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఇంటర్ కాలేజీ పురుషుల క్రీడలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్టర్ డాక్టర్ కే.సునీత అలాగే కళాశాల కరస్పాండెంట్ ఈ సుధాకర్‌రెడ్డి హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ.. క్రీడలకు ఉన్న ప్రాధాన్యతను గురించి ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొంటూ, వచ్చిన అందిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్రీడల్లో ప్రతిభ చూపించిన విద్యార్థులకు ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ప్రాధాన్యతను కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే యూనివర్సిటీ నుంచి ఎటువంటి సహాయ, సహకారాలు అందించడానికి మేము సిద్ధంగా సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. యూనివర్సిటీ క్రీడాకారులు మంచి ప్రతిభను కనబరుస్తున్నారని ప్రతి సంవత్సరం యూనివర్సిటీలో జరిగే క్రీడాకారుల సంఖ్య కూడా పెరగాలని కోరుకున్నారు. క్రీడలు ఆటలతో పాటు చదువులో కూడా శ్రద్ధ చూపించి మంచి భవిష్యత్తుకు బాట వేసుకోవాలని కోరారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ చైర్మన్ వెంకట్రాయులు మాట్లాడుతూ.. యూనివర్సిటీలో జరిగే అన్ని కార్యక్రమాలకు కళాశాల ఎంతో సహకరిస్తున్నాయని, వాళ్ళకి కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు, అబ్జర్వర్ రవీంద్రబాబు అన్ని కళాశాలల ఫిజికల్ డైరెక్టర్స్ క్రీడాకారులు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతుల ప్రదానం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గడ్డంవారిపల్లి గ్రామంలో ఆత్మనిర్భర భారత్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇంటింటా తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇంటింటికి స్వదేశీ వస్తువులు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించి విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఎస్.అమృత, టి.లక్ష్మీ, చైతన్యలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షురాలు విజయలక్ష్మి, అడవిపేరంటాలమ్మ ఆలయ చైర్మన్ రవీంద్ర, బీజేపీ జిల్లా కార్యదర్శి రత్నంనాయుడు, ఉపాధ్యక్షురాలు శివపార్వతి, బీజేపీ నాయకులు గడ్డం ప్రసాద్, నారాయణరెడ్డి, మన్నేటి శ్రీనివాసుల రెడ్డి, హరి, గడ్డం శ్రీనివాసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వెలుగోనులో స్వామిత్వ గ్రామసభ



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు మండలం వెలుగోను గ్రామంలో స్వామిత్వ ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ మేరకు సోమవారం వెలుగోను జరిగిన గ్రామంలో స్వామిత్వ ప్రత్యేక గ్రామసభలో లబ్ధిదారులకు అర్హత ధ్రువీకరణ పత్రాలను ఎంపీడీవో భవాని ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు అందజేశారు. ధ్రువీకరణ పత్రాలలో ఏవైనా అనుమానాలు ఉన్న తెలియజేయాలని ఎంపీడీవో భవాని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ టి.కృష్ణ, ఇతర సిబ్బంది లబ్ధిదారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధిపై ఆందోళన చెందాల్సిన అవసరంలేదు

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** జిల్లా కుష్టు, ఎయిడ్స్, క్షయ నిర్మూలన సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నెల్లూరు రూరల్ నియోజక వర్గం చంద్రమౌళి నగర్, పరిసర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని 29వ డివిజన్ కార్పొరేటర్, చంద్రమౌళి నగర్ పీహెచ్‌సీ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్ షేక్ సత్తార్ ప్రారంభించి మాట్లాడుతూ.. కుష్టు వ్యాధిపట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఇది అంటువ్యాధి కాదని, పూర్తిగా నయమయేందుకు మందులు ఉన్నాయని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రతి ఆశా కార్యకర్త, ఏఎన్ఎంలు పాల్గొని ఇంటింటికి తిరిగి ఎవరైనా వ్యాధిగ్రస్తులు ఉన్నారా, ఉంటే వారు ఎలాంటి చికిత్స పొందుతున్నారు. చికిత్స చేయించుకుంటున్నారా లేదా అనే వివరాలను నమోదు చేసుకుని, కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తిస్తారని, ఈ గుర్తింపు ద్వారానే వ్యాధిని నివారించడం సాధ్యమని తెలియజేశారు.

## కుష్టు వ్యాధి ముందస్తు గుర్తింపే లక్ష్యం

చంద్రమౌళి నగర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ షేక్ ఇమ్రాన్ మాట్లాడుతూ.. ఈ సర్వే 14 రోజులు పాటు జరుగుతుందని, జిల్లాలో కుష్టు వ్యాధి ముందస్తు గుర్తింపే లక్ష్యంగా నిర్వహిస్తున్నామని, ప్రధానంగా కుష్టు వ్యాధి లక్షణాలు చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డుగల చర్మం, చెవులు, వీపు, ఎదపై నొప్పిలేని బుడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పలపై వెంట్రుకలు రాలిపోవడం, ముక్క దిబ్బడ, ముక్కలో నుండి




రక్తం కారడం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు కలిగి ఉండడం, అరచేతులు అరికాళ్ళలో స్పర్శ కోల్పోవడం, చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం, చేతుల నుండి వస్తువులు, కాళ్ళనుండి చెప్పులు జారిపోవడం, తెలియకుండానే చేతులు కాళ్లల్లో బొబ్బలు రావడం, చేతి, కాలివేళ్ళు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం తదితర లక్షణాలతో ఉన్న వ్యక్తులకు బహుళ ఔషధ చికిత్స (ఎండీటీ) వలన కుష్టు వ్యాధిని సంపూర్ణంగా నయం చేయవచ్చని, ఎండిటి మందులు ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా లభిస్తున్నాయని, వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపకుండా వ్యాధిగ్రస్తులకు కుటుంబంలోనూ అలాగే సమాజంలోనూ చోటు కల్పించి సాధారణ జీవితం గడుపుటకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ కోఆర్డినేటర్ కొండాపురం వెంకటేశ్వర్లు, సూపర్వైజర్ కే.రమణి, పీహెచ్‌పీ జిల్లా నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, సభ్యులు షేక్ ఎస్దాని, బి.అపర్ణ, పెట్రీషియా ప్రేమరాజ్, ఆశాలు ఎ.ఆయేషా, షేక్ ఆసియా, ఏఎన్ఎంలు కే.రాధ, ఎస్.తిలకమణి తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా ప్రజోపయోగ పనులు



- సేద్యం చేసే ప్రతి రైతుకూ యూరియా బస్తాలు
- వైసీపీ హయాంలో మాదిరిగా వేధింపులుండవ్
- చీమకు కూడా హానిచేయబోం

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, ప్రజోపయోగ పనుల విషయంలో రాజకీయాలకు తావే లేదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు మండలం నల్లపాళెంలో సోమిరెడ్డి సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కాకాణి గోవర్ధన్‌రెడ్డి యూరియా కోసం జైలుకెళ్లాల్సిన అవసరం లేదని ఆయన చేసిన పాపాలు చాలా ఉన్నాయన్నారు. ఇప్పటికే కొన్ని పాపాలకు జైలుకు కూడా పోయివచ్చాడని పేర్కొన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించే బాధ్యత తమదన్నారు. ఇప్పటికే అన్ని కాలువలకు నీరు కూడా విడుదల చేయడం జరిగిందని చెప్పారు. ఒక టీఎంసీకి కచ్చితంగా 10వేల ఎకరాలకు తగ్గకుండా పంట పండించే బాధ్యత అధికారులపైన ఉందని అందుకు రైతులు సహకరించాలని సూచించారు. సేద్యం చేసే ప్రతి రైతుకు యూరియా అందేలా ముందస్తుగానే కార్డులు అందిస్తున్నామని వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు ఎకరాకు 3 యూరియా బస్తాలు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. ఎరువుల కొరత జాతీయ స్థాయి సమస్య అని అది సర్వేపల్లికో, నెల్లూరుకో పరిమితం కాలేదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు యూరియా అందకుండా వేధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. టీడీపీ సానుభూతి పరుల భూముల రికార్డులను ఇష్టారాజ్యంగా మార్చేశారని, ఇప్పుడేమో నిత్యం నన్ను, చంద్రబాబుని, ప్రభుత్వాన్ని తిట్టడమే పనిగా పెట్టుకున్నాడని కాకాణిని ఉద్దేశించి అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు జరుగుతున్న మంచి కాకాణితోపాటు వాళ్ల పార్టీకీ కనిపించడం లేదన్నారు. యూరియా విషయంలో తాము ప్రత్యేక శ్రద్ధతీసుకుంటు న్నామని, ఎక్కడా రైతులకు ఇబ్బంది లేకుండా చూసుకుంటామని చెప్పారు. రైతులకు ఉపయోగపడే డొంక రోడ్లు, లింక్ రోడ్ల విషయంలోనూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే పలు రోడ్లకు నిధులు కూడా మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రజోపయోగ పనుల విషయంలో రాజకీయాలకు తావే లేదని, చీమకు కూడా హాని తలపెట్టే మనస్తత్వం తమది కాదన్నారు. గోవర్ధన్‌రెడ్డి మాదిరిగా అమాయకులను జైళ్లకు పంపలేదని, నల్లపాళెంలో సురేష్ రెడ్డి పొలాల్లో పైపులను ధ్వంసం చేయించినట్లు తామెక్కడా చేయడం లేదన్నారు. చేతనైతే పేదలకు సాయం చేస్తాం కానీ, కాకాణి మాదిరిగా అమాయకులను వేధించమని పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో ఆయన వెంట పొదలకూరు మండల టిడిపి అధ్యక్షుడు తలచిరు మస్తాన్ బాబు, మండల తెలుగు యువత అధ్యక్షుడు వెన్నపూస రాజశేఖర్ రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు పార్లపల్లి మోహన్ సురేష్ రెడ్డి, పార్లపల్లి రమేష్ రెడ్డి, కలిచేటి ప్రభాకర్ రెడ్డి, బాలిరెడ్డి హనుమారెడ్డి, కండే మస్తానయ్య, అడపాల సుధాకర్ రెడ్డి, పల్లారపు కృష్ణ, దేగా యశ్వంత్ రెడ్డి, ఆదాల మురళీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ హెల్త్ సేవలను వినియోగించాలి : వీఎస్‌యూ వీసీ

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ హెల్త్ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వీఎస్‌యూ సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో పీఎం, యుఎస్‌హెచ్‌ఏ సహకారంతో ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఏబీహెచ్‌ఏ) పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆభా అకౌంట్ ద్వారా ఆరోగ్య సేవలు మరింత సులభతరం, వేగవంతం అవుతాయని చెప్పారు. డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫార్మ్‌ల వినియోగంపై విద్యార్థులు అవగాహన పెంపొందించి సమాజానికి దారితీయాలని సూచించారు. ప్రధాన వక్తగా మాట్లాడిన ఏసిఎస్ఆర్ గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ నోడల్ అధికారి డా. పీవీ సుశీల్ కుమార్, ఆభా అకౌంట్ ప్రయోజనాలు, నమోదు విధానం, డిజిటల్ ఆరోగ్య హక్కులపై విద్యార్థులకు సమాచారాన్ని అందించారు. దేశవ్యాప్తంగా వైద్య సేవల ఏకీకరణతో అత్యవసర పరిస్థితుల్లో రోగి ఆరోగ్య చరిత్రను వేగంగా యాక్సెస్ చేయడం సులభమవుతుందని తెలిపారు. గౌరవ అతిథిగా పాల్గొన్న వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ.. విద్యార్థులు డిజిటల్ ఆరోగ్య సేవలను అర్థం చేసుకుని, తల్లిదండ్రులు, సమాజానికి ఈ విషయంపై అవగాహన కల్పించాలని సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు నాణ్యమైన వైద్య సేవల అందుబాటులో కీలకమని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ విజయ మాట్లాడుతూ.. డిజిటల్ హెల్త్ సేవలు భవిష్యత్తులో ఆరోగ్యరంగాన్ని పూర్తిగా మార్చే శక్తి కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. యువత ఆరోగ్య భద్రతతో పాటు డిజిటల్ అవగాహనను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.మధుమతి, డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఏవీఎస్ ఆధ్వర్యంలో వీరనారి ర్యాలీ




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఝాన్సీ లక్ష్మీబాయిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్లవరపు అశోక్ రెడ్డి కోరారు. ఆంధ్ర విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణంలో సోమవారం స్థానిక బస్టాండ్ సెంటర్ నుండి సోమశిల సెంటర్ వరకు విద్యార్థినిలతో ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటంతో హోరెత్తిన నినాదాలతో వీరనారి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు మల్లవరపు అశోక్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏవీఎస్ రాష్ట్ర అధ్యక్షులు అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. ఇంటి నుండి దేశం వరకు అభివృద్ధి చెందాలన్నా క్రమశిక్షణలో ఉండాలన్న అది ఒక మహిళ వలన సాధ్యం అవుతుందని వీరవీరనారి పరాక్రమంతురాలైన ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా సోమవారం ఆత్మకూరులో ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయిని విద్యార్థినిలు అందరూ ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలు అయినా ఇంకా మహిళలకు రక్షణ లేకుండా పోతుందని కఠినమైన చట్టాలు తీసుకొచ్చి రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏవీఎస్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు మహంత్ రెడ్డి, ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకులు చందు, వినయ్, తరుణ్, భరత్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.

# కవి సమ్మేళనాలతో మానసిక ఆలోచన పెరుగుతుంది



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** కవి సమ్మేళనాలను తరచూ పరిశీలిస్తుంటే మానసికమైన ఆలోచనలు కలుగుతాయని మనోజ్ కుమార్ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు కవి సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయాధికారి జే.కొండయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఇప్పటినుండే రచనల పట్ల ఆసక్తి చూపాలన్నారు కవితలు కథలు చిన్నచిన్న నాటిక సంభాషణలు తదితరాలు రాయడం అలవాటు చేసుకున్నట్లయితే భవిష్య త్తులో మంచి రచనలు చేయడం అభ్యాసం అవుతుందన్నారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే విధంగా ఈ కవి సమ్మేళనాలు కూడా ఉపయోగపడతాయన్నారు. కవులు ఏ విధంగా తన రచనను ప్రారంభిస్తున్నారో.. ఆ రచనలు ఎలాంటి అంశాన్ని సూచిస్తున్నాయో అవి ఇచ్చే సందేశం ఏమిటో తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు. గ్రంథాలయాలను సక్రమంగా ఉపయోగించుకుని తద్వారా పొంది ప్రయోజనాన్ని భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా సద్వినియోగ పరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉన్నారు.

# సీఐ సతీష్ మృతి ప్రమాదం కాదు

- ఏపీ కుమ్మర యువసేన రాష్ట్ర అధ్యక్షులు సుమన్ ప్రజాపతి

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన కుమ్మర కులస్థుడు పోలీసు శాఖలో సీఐగా పనిచేస్తున్న సతీష్ అనే వ్యక్తిని అతి కిరాతకంగా రాడ్డుతో తలపై కొట్టి, పక్కటెముకలు విరిగేలా కొట్టి చంపి రైలు పట్టాల పక్కన పడేసి, రైలు ప్రమాదంలా సృష్టించిన ఘటనపై కుటుంబ సభ్యులకు, రాష్ట్రంలో ఉన్న 16లక్షలకు పైగా ఉన్న కుమ్మర్లకు పలు అనుమానాలు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ కుమ్మర యువసేన రాష్ట్ర అధ్యక్షులు పెళ్లూరు సుమన్ ప్రజాపతి అన్నారు. మృతుడు సతీష్ గత ప్రభుత్వం హయాంలో టీటీడీ నందు విధులు నిర్వహించేటప్పుడు, అక్కడ పరకామణిలో జరుగుతున్న అవినీతిపై అప్పటి రాజకీయ నాయకులపై పిర్యాదు చేయటంతో సతీష్ పైన కక్ష్య పెట్టుకొన్న రాజకీయ నాయకులు, ఇప్పుడు ఆ కేసు ముగింపు దశలో ఉండగా ప్రధాన సాక్షి ఐన సతీష్ రైలు పట్టాలపై అనుమానాస్పదంగా శవమై పడిఉండటం పలు అనుమానాలకు తావు ఇస్తుందని సుమన్ ప్రజాపతి చెప్పొ కొచ్చారు. ఇందులో భాగంగా 19వ తేది, బుధవారం 10 గంటలకు, విజయవాడలోని, డీజేపీ కార్యాలయంలో డీజీపీని కలిసి మన కులభందువు, సతీష్ అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ చేపట్టి, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులను వెంటనే అరెస్టు చేసి న్యా యాన్ని కాపాడాలని వినతిపత్రం అందచేయాలని ఆంధ్రప్రదేశ్ కుమ్మర యువసేన రాష్ట్ర కార్యవర్గం నిర్ణయం తీసుకోవటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుండి కుమ్మర కులాభిమానులు పెద్ద ఎత్తున విజయవాడ డీజీపీ కార్యాలయం దగ్గరకు బుధవారం 10 గంటలకు చేరుకోవాలని, అక్కడ నుండి ర్యాలీగా వెళ్లి డీజీపీని కలిసి వినతిపత్రం అందచేస్తామని రాష్ట్ర కుమ్మర్లకు పిలుపు నివ్వటం జరిగింది.

# చివరి కార్తీక సోమవారం, మారుమ్రోగిన శైవ క్షేత్రాలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** కార్తీక మాసం చివరి కార్తీక సోమవారం సందర్భంగా నెల్లూరులోని శైవ క్షేత్రాలు శివనామ స్మరణతో మార్మోగాయి. హిందూ ధర్మంలో అత్యంత పవిత్రమైనదిగా భావించే కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా తెల్లవారుజాము నుండే భక్తులు ఆలయాలకు భారీగా తరలివచ్చారు. భక్తులు ఉదయాన్నే ప్రముఖ నదులతోపాటు ఇతర పవిత్ర నదీ తీరాల్లో, చెరువులలో కార్తీక స్నానాలు ఆచరించి శివుడిని దర్శించుకున్నారు. ఆలయాల్లో స్వామివారికి పాలు, పెరుగు, తేనె వంటి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. శివలింగాలకు మారేడు దళాలు, తెల్లటి పువ్వులతో పూజలు చేసి, దీపారాధనలు చేశారు. కార్తీక మాసమంతా దీపం వెలిగించని వారు ఈ ఒక్క రోజు 365 వత్తులతో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. చాలామంది భక్తులు రోజంతా ఉపవాసం (నక్తం వ్రతం) ఉండి, సాయంత్రం ప్రదోషకాలంలో శివాలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో వచ్చే ప్రతి సోమవారానికి విశేష ప్రాధాన్యత ఉంటుంది. అయితే చివరి సోమవారం మరింత ప్రత్యేకమైనదిగా భావిస్తారు. ఈ రోజున



భక్తిశ్రద్ధలతో శివుడిని పూజిస్తే, కోటి సోమవారాలు వ్రతం ఆచరించినంత ఫలితం లభిస్తుందని భక్తులు భావిస్తారు. ఈ రోజున శివారాధన చేయడం వలన సకల పాపాలు తొలగిపోయి, అదృష్టం, సిరి సంపదలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. చివరి రోజున అన్నదానం, వస్త్రదానం వంటి పుణ్యకార్యాలు ఆచరించి, ఆవుకు ఆహారం తినిపించడం వల్ల శివయ్య అనుగ్రహం లభిస్తుందని నమ్ముతారు. కార్తీక మాసం చివరి సోమవారం భక్తి పారవశ్యంతో, ఆధ్యాత్మిక శోభతో ముగిసింది. నెల్లూరు మూలాపేటలో వెలసియున్న శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి ఆలయం నందు విశేషంగా పూజలు నిర్వహించారు. ఆలయంకు వచ్చిన భక్తులకు దేవస్థానం వారు సకల ఏర్పాట్లు చేసినారు. ఈ కార్యక్రమాలు అన్ని ఆలయ సహాయ కమిషనర్ కార్యనిర్వహణాధికారి అర్వ భూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

# ఆత్మకూరు ఎస్సీ హాస్టల్ తనిఖీ

**విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యతను పరిశీలించిన కౌన్సిలర్**



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని 20వ వార్డు పరిధిలో ఉన్న సోషల్ వెల్ఫేర్ ఎస్సీ హాస్టల్‌ను ఆదివారం రాత్రి స్థానిక వార్డు కౌన్సిలర్ సురా భాస్కర్‌రెడ్డి సందర్శించారు. ఇక్కడ విద్యార్థులకు అందుతున్న భోజన వసతి ఇతర వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఐదవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే మొత్తం 85మంది విద్యార్థులు ఈ హాస్టల్లో ఉండి విద్యాబోధన చేస్తున్నారు. హాస్టల్‌ను స్థానిక వార్డు కౌన్సిలర్ సురా భాస్కర్‌రెడ్డి పరిశీలించి విద్యార్థులకు అందుతున్న భోజన వసతి ఇతర వసతుల గురించి విద్యార్థులతో అడిగి తెలుసుకొని విద్యార్థులకు స్వంత నిధులతో సమాకూర్చిన స్వీట్లు పంచారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం పాఠశాలలలో, హాస్టల్‌లలో ఉండే విద్యార్థులకు సరైన వసతులు అందించాలని తమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆశించిన విధంగా తమ నేత రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచనలతో తన పరిధిలో ఉండే వివిధ హాస్టలను పాఠశాలలను పరిశీలించి ఇక్కడ విద్యార్థులకు ఉండే సమస్యలను తెలుసుకొని తమ మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు నేడు ఇక్కడ పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఇక్కడ విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూసి హాస్టల్‌ను పరిశీలించినట్లు తెలిపారు. ఈ హాస్టల్లో అన్ని వసతులు బాగానే ఉన్నాయని భోజనం కూడా రుచికరంగా ఉందని కౌన్సిలర్ సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల అవసరాలను గుర్తించేందుకు ప్రతినెల హాస్టల్ ను పరిశీలిస్తానని సురా భాస్కర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులతో విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఉజ్వల భవిష్యత్తును పొందాలని సూచించారు. వీరితోపాటు ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (వార్డెన్) స్పందన, టీడీపీ 20వ వార్డు అధ్యక్షులు గురునాథం శ్రీనయ్య, నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు. హాస్టల్‌ను పరిశీలించి తమ సమస్యలను తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ సురా భాస్కర్ రెడ్డికి హాస్టల్ విద్యార్థులు, హాస్టల్ వార్డెన్ స్పందన ధన్యవాదాలు తెలిపారు.

## బుజబుజ నెల్లూరు స్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలి



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం లోని బుజబుజ నెల్లూరులో స్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలని, సీపీఎం పార్టీ 25 డివిజన్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు ప్రజా విజ్ఞప్తుల దినంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడుతూ.. బుజబుజ నెల్లూరు నందు పంచాయతీగా ఉన్నప్పుడు మూడు ఎకరాల 75 సెంట్లు స్మశాన వాటిక ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పంచాయతీ కార్పొరేషన్ లో విలీనం అయిన తర్వాత కోటి రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది. కానీ స్మశాన వాటికను పూర్తిగా అభివృద్ధి చేయకుండా కేవలం గ్రావిల్‌తో లెవలింగ్ చేసి వదిలేసారు. ఆ తర్వాత అధికారులు పట్టించుకోకపోవడం వలన స్మశాన వాటిక ఆక్రమణలకు గురి అవుతున్నది. వర్షాలు పడిన సందర్భంలో నీళ్లు నిండి దుర్గంధం వెదజల్లుతుంది. ముళ్ళ పొదలతో నిండిపోయి ఉన్నది. ఫలితంగా కొంతమంది ఆ స్థలాన్ని కబ్జా చేసి మెకానిక్ షెడ్లుగా మార్చుకొని రిపేర్లు చేస్తూ ఇక్కడే భారీ వెహికల్స్ నిలుపుతున్నారు. శవాన్ని తీసుకొని ఇక్కడికి వస్తే కనీసం స్నానం చేయాలన్నా, కాళ్లు కడుక్కోవాలన్నా నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలకు గురైన స్మశాన వాటికను విడిపించి, ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రూరల్ కమిటీ ఎన్.మాలకొండయ్య, శాఖ కార్యదర్శి కే.కృష్ణమూర్తి, డి.వెంకటేశ్వర్లు, కేవి శివాజీ, బి.వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, ఈశ్వరయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మూర్ఛ వ్యాధిపై నియంత్రన అవగాహనతోనే సాధ్యం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** మూర్ఛ వ్యాధిపై నియంత్రన అవగాహన తోనే సాధ్యం అవుతుందని సోమవారం ఉదయం నెల్లూరు మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ డి.బాల ఖాసీమ్ మాట్లాడుతూ తెలిపారు. డాక్టర్ డి.బాల ఖాసీమ్ మాట్లాడుతూ.. మెదడు అనేది మానవ శరీరంలో అత్యంత క్లిష్టమైన అవయవం. ఇది మన ప్రతి కదలిక, ఆలోచన మరియు భావోద్వేగానికి మూలం. అయితే, ఈ సంక్లిష్ట వ్యవస్థలో ఏర్పడే చిన్నపాటి అసమతౌల్యం కూడా జీవితాన్ని ప్రభావితం చేయవచ్చు. అటువంటి నాడీ సంబంధిత వ్యాధులలో ఒకటి ఎపిలెప్సీ (మూర్ఛ వ్యాధి). ఈ వ్యాధిపై సమాజంలో నెలకొన్న అపోహలను తొలగించి, సరైన అవగాహన పెంపొందించడం అత్యంత అవసరం అని తెలిపారు. ఎపిలెప్సీ అనేది మెదడులోని నాడీ కణాలలో (న్యూరాన్స్) ఏర్పడే అసాధారణమైన విద్యుత్ చర్యల వల్ల సంభవించే దీర్ఘకాలిక నాడీ వ్యాధి. సాధారణంగా, మెదడులోని కణాలు నియంత్రిత పద్ధతిలో విద్యుత్ సంకేతాలను పంపుతాయి. మూర్ఛ వచ్చినప్పుడు, ఈ విద్యుత్ చర్యలు అకస్మాత్తుగా, అనియంత్రితంగా మారిపోతాయి. దీని ఫలితంగా వ్యక్తిలో అనేక రకాల లక్షణాలు కనిపిస్తాయి, వీటిని 'మూర్ఛ' లేదా 'ఫిట్స్' అని అంటారు అని తెలిపారు. మూర్ఛ లక్షణాలు మెదడులోని ఏ భాగం ప్రభావితమైందనే దానిపై ఆధారపడి ఉంటాయి. శరీర కండరాలు అకస్మాత్తుగా బిగుసుకుపోవడం లేదా తడుపులు చూపడం. తాత్కాలికంగా స్పృహ కోల్పోవడం (అపస్మారక స్థితి). తదేకంగా ఒకే వైపు చూడటం. చిన్నపాటి కదలికలు లేదా అయోమయ స్థితి. కొన్నిసార్లు, ఇది కేవలం కొన్ని సెకన్ల పాటు మాత్రమే ఉండి, బయటి వారికి గుర్తించలేని విధంగా కూడా ఉండవచ్చు. ఎపిలెప్సీ అనేది భయపడాల్సిన వ్యాధి కాదు. ఆధునిక వైద్యం ద్వారా దీనిని చాలా వరకు సమర్థవంతంగా నియంత్రించవచ్చు అని డాక్టర్ డి.బాల ఖాసీమ్ తెలిపారు.

## పదో తరగతి విద్యార్థులకు ఫీజు చెల్లించిన ఎమ్మెల్యే



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండలంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివే విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని వారిపబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ఫీజును ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చెల్లించారు. ఈ మేరకు సోమవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఆయన ఆదేశాల మేరకు మండల టీడీపీ నాయకులు విద్యాశాఖ అధికారులు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఎంఈఓలు టి వెంకటేశ్వర్లు,, టి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. మండలంలో 11 పాఠశాలలో ఉన్నాయన్నారు. వాటిలో 3 31 మంది పదో తరగతి విద్యార్థులు కాను పరీక్ష ఫీజు రూ.55,535లు ఎమ్మెల్యే చెల్లించడం సంతోషకరమన్నారు. అనంతరం నగదను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు స్థానిక నాయకులతో కలిసి అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.శ్రీనివాసులు, నాయకులు మన్నటి వెంకటరెడ్డి, రియాజ్, శ్రీనివాసులు, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అడవిని తలపిస్తున్న కండలేరు మట్టికట్ట..

● బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ఆరోపణ



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** తెలుగు గంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన కండలేరు జలాశయం మట్టికట్ట అడవిని తలపిస్తోందని బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ఆరోపించారు. కండలేరు డ్యామ్ మట్టి కట్టను సోమవారం ఆయన పొదలకూరు మండల బిజెపి నేతలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కండలేరు డాం నిర్వహణ పట్ల అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. డ్యాం మట్టికట్ట మెయింటినెన్స్ గాలికి వదిలేశారని ఆరోపించారు. కండలేరు మట్టికట్ట నిర్మాణం జరిగి 30 సంవత్సరాలు దాటిన నేపథ్యంలో మట్టి కట్టను వెడల్పు చేసి పటిష్ట పరచమని నిపుణుల కమిటీ సూచించిందన్నారు. ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోక పోవడం దురదృష్టకరం అని అన్నారు. అడవిని తలపించే విధంగా మట్టి కట్టపై చెట్లు పెరిగి ఉన్నాయని, ఇవి మట్టి కట్టను బలహీన పరుస్తున్నాయని వివరించారు. మట్టి కట్ట ఒక అడుగు మేర ఎత్తు తగ్గి భూమిలోకి పోయిందని చెప్పారు. ప్రస్తుతం ఇటువంటి జలాశయం నిర్మించాలంటే రూ.60వేల కోట్లు అవసరం అవుతుందన్నారు. ప్రభుత్వాలు ఏదైనా కొత్త ప్రాజెక్టులపై మక్కువ చూపడంతో పాటు ఉన్న ఇటువంటి ప్రాజెక్టులను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తక్షణమే కండలేరు మట్టి కట్ట ప్రతిష్ట కోసం యుద్ధ ప్రాతిపదిక చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు మండల బీజేపీ అధ్యక్షులు పూల ప్రశాంత్, బీజేపీ సీనియర్ నాయకులు చింత గింజల సుబ్రమణ్యం, రాచపూటి ధనుంజయ రావు, నరాల సుబ్బారెడ్డి, అక్కెం జనార్ధన్ రెడ్డి, డబ్బుగుంట అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా స్టేడియంకు నిధులు మంజూరు

▶ మంత్రి ఆనంకు ధన్యవాదాలు తెలిపిన క్రీడాకారులు, విద్యార్థులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి సహకారంతో గతంలో ఆత్మకూరు పట్టణంలో నిర్మాణంలో ఉండి గత 12 ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న క్రీడా స్టేడియంని నిర్మించేందుకు సుమారు రెండు కోట్ల నిధులు మంజూరు చేయించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఆత్మకూరు ప్రాంత క్రీడాకారులు క్రీడా అభిమానులు ధన్యవాదాలు తెలిపారు. ఆత్మకూరులోని హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు మునికుమార్, విద్యార్థులు విధులు మంజూరు చేసిన సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ ఆత్మకూరు కేంద్రంగా గతంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి ఆటల పోటీలు జరిగాయని ఇప్పుడు ఈ స్టేడియం పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టిన తర్వాత ఈ ప్రాంతంలో క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు వారి క్రీడా నైపుణ్యం వెలుగులోకి వచ్చేందుకు ఈ స్టేడియం ఎంతో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తపరిచారు.






### అమ్మో ఈ పద్మవ్యూహాన్ని దాటేదెలా..

## ఎన్ని రోజులు.. ఫ్లై ఓవర్ రహదారి కష్టాలు..

ఆత్మకూరు బస్టాండ్ ఫ్లేవర్ మరమ్మతుల కారణంగా మూసివేయడంతో సోమవారం ఉదయం నెల్లూరు నగరంలో ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతంలో భారీగా వాహనాలు ఆగిపోయి పద్మవ్యూహాన్ని తలపించాయి. 45 రోజులు ఇలానే ఉదయం ట్రాఫిక్ ఉంటుంది అంటూ ట్రాఫిక్ పోలీసు చెపుతున్నారు.

సూర్య స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కోదండపాణి



# నెల్లూరులో ప్రధాన సమస్యలపై మంత్రి నారాయణ ఫోకస్

- హామీ ఇచ్చిన గంటల వ్యవధిలోని ప్రధాన సమస్యలకు పరిష్కార మార్గం
- సండే మార్కెట్ వద్ద రోడ్డు పనులకు శంకుస్థాపన
- ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం
- ఇచ్చిన ప్రతి హామీని సకాలంలో నెరవేరుస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరులో ప్రధాన సమస్యలపై రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో హామీ ఇచ్చిన గంటల వ్యవధిలోనే సమస్యల పరిష్కారానికి మంత్రి కార్యచరణ చేపట్టారు. నెల్లూరు సండే మార్కెట్లో వర్షాలు వచ్చిన సమయంలో నెలకొంటున్న తీవ్ర ఇబ్బందికి పరిష్కారమార్గం చూపారు. సండే మార్కెట్ వద్ద రోడ్డు పనులకు మంత్రి నారాయణ సోమవారం శంకుస్థాపన చేశారు. అలాగే ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి వద్ద కోటి రెండులక్షలతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభింప చేశారు. శంకుస్థాపన కార్యక్రమాలకు విచ్చేసిన మంత్రి నారాయణకు స్థానిక టీడీపీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ మంత్రి నారాయణ ముందుకు కదిలారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ.. ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి రోడ్డు వద్ద నెలకొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా పనులకు శంకుస్థాపన చేసామన్నారు. 44 రోజుల్లో నిర్మాణ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. డిసెంబర్ 31వ తేదీన ఈ రోడ్డును ప్రారంభిస్తామని తెలియజేశారు. రద్దీ ప్రాంతం కావటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వన్ సైడ్ రోడ్ పనులు తొలివిడతగా చేపట్టామన్నారు. మరో కోటి రూపాయలతో డిసెంబర్ 31న రెండో సైడ్ రోడ్ పనులకు శంకుస్థాపన చేస్తానన్నారు. ఫిబ్రవరి 15న రోడ్డును ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా సండే మార్కెట్లో వర్షాల సమయంలో నెలకొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సండే మార్కెట్ ప్రాంతాన్ని పరిశీలించి వెంటనే సోమవారం పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. కాలువలపై ఆక్రమణదారులు సహకరిస్తే పూడిక తీయించి వర్షపు నీరు సజావుగా వెళ్లే విధంగా చేస్తామన్నారు. తద్వారా సండే మార్కెట్లో మరోసారి వర్షపు నీరు నిలిచే అవకాశం ఉండదని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. నెల్లూరులో కూటమి ప్రభుత్వం చేస్తున్న



అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు.

## ప్రతిదీ రాజకీయం చేయడం సిగ్గుచేటు

ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం సబబు కాదంటూ రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ హితువు పలికారు. నెల్లూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రిని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ మాట్లాడారు. నెల్లూరు చింతారెడ్డిపాలెం క్రాస్ రోడ్ వద్ద అండర్ పాస్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయన్నారు. అయితే దాన్ని రాజకీయం చేయటం సిగ్గుచేటని తెలిపారు. చింతా రెడ్డిపాలెం క్రాస్ రోడ్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మూడు నెలల్లో టెండర్లు పిలుస్తామని స్పష్టం చేశారు. పనులు ప్రారంభించిన తర్వాత ఏడాదిలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని స్పష్టం చేశారు. కొందరు ఈ విషయమై రాద్ధాంతం చేసేందుకు ధర్నాలు చేస్తున్నారని, ఇది నిజంగా సిగ్గుపడాల్సిన విషయం అని ఎద్దేవా చేశారు. గతంలో ఎన్నడు లేని విధంగా కూటమి ప్రభుత్వంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇష్టానుసారంగా ఆరోపణలు అవాకులు చవాకులు పేలడం మంచి పద్ధతి కాదంటూ మంత్రి నారాయణ తనదైన శైలిలో హితువు పలికారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్‌తోపాటు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ, నగర అధ్యక్షుడు మామిడాల మధు, 45వ డివిజన్ అధ్యక్షుడు సుజనా కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్ శ్రీకాంత్ రెడ్డి, కో క్లస్టర్ రవి, క్లస్టర్ ఇంఛార్జి శ్రీకాంత్, టీడీపీ ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## శివనామ స్మరణతో మారు మోగిన శివాలయాలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని పలు శివాలయాల్లో కార్తీకమాస చివరి సోమవారం సందర్భంగా శివనామస్మరణతో ఆలయాలు మారు మ్రోగాయి. మండలంలోని లింగాల దాన, ఎర్రబల్లి గడ్డ, అర్లపడియ, గండిపాలెం అప్ప సముద్రం ఉదయగిరి శివాలయాల్లో భక్తులు వేకువ జాము నుంచే చేరుకొని విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించి కార్తీకదీపం వెలిగించారు. ఆలయ అర్చకులు ఆయా స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని శివనామస్మరణ చేసుకుంటూ పరవశించిపోయారు. భక్తుల రద్దీకి తగ్గట్టుగా ఆలయ కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గండిపాలెం గన్నేపల్లి పంచాయ తీలోని అడవి పేరంటాలమ్మ ఆలయం వద్ద వనభోజన కార్యక్రమాలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. కులమతాలకు అతీతంగా సహ పంక్తిభోజనాలు చేశారు. గండిపాలెంలో ప్రాజెక్టు చైర్మన్ అడుసు మల్లి.వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమం నిర్వహించారు.

## వైభవంగా ఆలయంలో 4వ కార్తీక సోమవారం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరం దుర్గామిట్టలో వేంచేసియున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో ప్రతిష్ఠ గావించబడిన శ్రీ మీనాక్షి సమేత శ్రీ సుందరేశ్వరస్వామి వారి దేవస్థానం నందు 4వ కార్తీక సోమవారం సందర్భంగా ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరుగు శ్రీ శివపార్వతుల కళ్యాణంను పురస్కరించుకొని శ్రీ అమ్మవారి దేవస్థానం నందు ఉదయం సంపూర్ణ చండీ హోమం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం శ్రీ స్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, వివిధ రకాల పండ్లతో అభిషేకాలు, మధ్యాహ్నం12.00లకు అన్నాభిషేక కార్యక్రమం జరిగింది. శ్రీ వార్ల దర్శనార్థం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించుట జరిగింది. పై కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బొల్లినేని రాజగోపాల్ నాయుడు కుటుంబ సమేతముగా విచ్చేసినారు. ఆలయం తరపున వారికి ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో ఘనస్వాగతం పలికి శ్రీవార్ల దర్శనం అనంతరం వారికి వేదాశీర్వచనం చేయుట జరిగింది. తదుపరి సంపూర్ణ చండీ హోమంలో పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటలకు ప్రదోషకాల సందర్భంగా శ్రీ స్వామి వారి ఆలయం నందు ప్రదోషకాలపూజలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి, ఆలయ ప్రధాన అర్చకులు, ఉప ప్రధాన అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రసన్న వెంకటేశ్వరుని సన్నిధిలో కార్తీక వెలుగులు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మాగుంట లేఔట్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు కార్తీక మాసం చివరి నాల్గవ సోమవారం సందర్భంగా భక్తులు సోమవారం ఉదయం నుండి శ్రీవారి దర్శనం చేసుకున్నారు. కార్తీక మాసంలో శివుడు, శ్రీనివాసుడు ఇరువురికి ప్రీతికరం. భక్తులు భారీగా తరలివచ్చి ఉదయం నుండి కార్తీక దీపాలు వెలిగించి శ్రీవారిని స్మరించుకున్నారు. అనంతరం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించి శ్రీవారిని దర్శించి తరించారు. ఆలయం వారు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసి వారికి తీర్థప్రసాదములు అందించారు.

## శబరి యాత్రకు అయ్యప్పలు పయనం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** శబరిమల యాత్రకు అయ్యప్ప భక్తులు సోమవారం బయలు దేరి వెళ్లారు. ముత్తుకూరు మండల కేంద్రం బ్రాహ్మణ వీధికి చెందిన డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ 34వ సారి ఇరుముడి కట్టుకొని సహచర స్వాములు 14 మంది అయ్యప్ప భక్తులతో కలిసి శబరి యాత్ర వెళ్ళడం జరిగింది. శ్రీ మహాలక్ష్మమ్మ ఆలయ ప్రాంగణంలో ఇరుముడి మహోత్సవాన్ని చేసుకున్నారు. కుటుంబ సభ్యులు దగ్గరుండి సాగనంపారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ సీబీఎస్ఈ కళాశాలను సందర్శించిన జీఎం



**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** నగరంలోని స్థానిక గోమతి నగర్ నందు గల నారాయణ సీబీఎస్ఈ కళాశాలను నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఈ విద్యా సంవత్సరం విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు మంచి పేరు తేవాలని, సిబ్బందికి అధ్యాపకులకు సూచించారు. అలాగే విద్యార్థులకు మానసిక ఒత్తిడి తగ్గించేందుకు చదువుతోపాటు క్రీడా పోటీలు, స్కిల్ డెవలప్మెంట్, యోగ వంటి కార్యక్రమాలు నిర్వహించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధీర్ సిబ్బంది అధ్యాపకులు పాల్గొన్నారు.